క్లుప్తంగా

రెండు లారీల ఢీ-ఇరువురికి గాయాలు

మేదరమెట్ల: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొన్న ఘటన మంగళవారం తెల్లవారు జామున కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద చోటుచేసుకుంది. మార్టూరు నుంచి చెన్నైకు శిల్పాల లోడుతో వెళ్తున్న లారీ కొరిశపాడు మండలం మేదరమెట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతున్న సమయంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈప్రమాదంలో లారీలో నిద్రిస్తున్న క్లీనర్ ప్రభాకర్‌కు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన ఇరువురినీ 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక



ఎన్నికైన ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు

చీరాల అర్బన్: పట్టణంలోని పొట్టి శ్రీరాములు ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా మానుకోట సురేష్, కార్యదర్శిగా జి.సురేష్ జయకుమార్, సహాయ కార్యదర్శిగా తాళ్లూరు చంద్రశేఖర్, కోశాధికారిగా సిరిపురం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీగా నాగబాబు, ఆలుదాసు శ్రీధర్, ఎండ్రపాటి వెంకట్రావు, శవనం మోజెస్. పాలేటి సాంబశివరావు, కె.గోపీకృష్ణ, ఆసాది రుద్రారెడ్డి, మేకపోతు వాసులు వ్యవహరించారు. ఎన్నికై న సభ్యులను సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు అభినందనలు తెలిపారు.


అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు

మేదరమెట్ల: కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అద్దంకి, కొరిశపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త సహాయకురాలు పోస్టులకు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో కృష్ణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి మండలంలో పసుమర్తివారిపాలెం ఎస్సీ ఊరచెరువు (బీసీ-ఏ), కొరిశపాడు మండలంలో మేదరమెట్ల-5లో జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, అర్హత ఉన్న వారు తమ దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యలయంలో అందజేయాలని ఆమె కోరారు.

ఇరు వర్గాలపై కేసు

మార్టూరు: భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో మంగళవారం మార్టూరు పోలీస్ స్టేషన్ లో రెండు కేసులు నమోదయ్యాయి. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. ద్రోణాదుల గ్రామానికి చెందిన పాదర్తి లక్ష్మి అదే గ్రామానికి చెందిన స్వర్ణ నీలవేణి కుటుంబాల మధ్య చాలా కాలంగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం పైరెండు కుటుంబాలకు చెందిన ఇరు వర్గాలకు పొలం వద్ద ఘర్షణ జరిగింది. అందులో భాగంగా మంగళవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌లో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై స్వర్ణ, నీలవేణి ఆమె సమీప బంధువులు ఏడుగురుపై కేసు నమోదు చేశారు. రెండో వర్గానికి చెందిన స్వర్ణ, నీలవేణి ఇచ్చిన ఫిర్యాదుపై పాదర్తి లక్ష్మి ఆమె బంధువులు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖమండప నిర్మాణానికి అద్దంకికి చెందిన మోదుదుగు వెంకటేశ్వరరావు, సునీతలు రూ.1 లక్ష చెక్‌ను దేవస్థాన ఏసీ ఎం తిమ్మనాయుడికి అందజేశారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం



హెచ్‌ఎంకు ఇనుప బీరువా, బల్లలు అందిస్తున్న దాత

వేటపాలెం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి అన్నారు. మంగళవారం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్షీరపురి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఐతా రవీంద్రనాథ్ బీరువా, రెండు బల్లలను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతలు అందజేసిన వస్తువులను స్కూల్ ఉపాధ్యాయులు సద్వినియోగించుకోవాలని తెలిపారు. దాతలకు స్కూల్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివసారావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనురాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం పాల్గొన్నారు.

మలి వయసు.. జ్ఞాపకాల జీవితం



చెస్ ఆడుతున్న వృద్ధులు



మ్యూజికల్ చైర్స్ పోటీలో పాల్గొన్న వృద్ధులు



విజేతలకు బహుమతులందిస్తున్న బ్రహ్మానందరెడ్డి

- ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం
- ఆటలాడిన వృద్ధులు

చినగంజాం: మలి వయసులో వృద్ధులు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ హాయిగా జీవితం గడపాలని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు క్యారమ్స్, చెస్, వైకుంఠపాళి, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన వృద్ధులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాన్ని భారత్ నిర్మాణ్ వలంటీర్ ఈ గోవిందస్వామి, సోమయ్య నిర్వహించారు.



చీరాలలో బహుమతులు అందిస్తున్న లక్ష్మీపద్మావతి

చీరాల అర్బన్: చీరాల పాలిమేర రోడ్డులోని మహిళా మండలిలో మంగళవారం వృద్ధులకు ఆటల పోటీలను నిర్వహించారు. అలానే స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం సాయంత్రం వృద్ధులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ ఇన్ స్పూన్, పాటల పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి చీరాల మహిళా మండలి వ్యవస్థాపకురాలు జాగర్లమూడి లక్ష్మీపద్మావతి, డాక్టర్ డీఎస్ఆర్‌కె ప్రసాదరావు, ఎంఎంసీ టిఐ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి చేతుల మీదగా విజేతలు బి.సీతమ్మ, ఎ.మేరి, ఎం.జానకమ్మ, కె.ఇంద్రాణి, డి.రవణమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ పుష్ప, ఫ్యామిలీ కౌన్సిలర్ సంధ్య, ఐఎంటీఎస్ అంజలి, ఓఆర్‌డబ్ల్యూ దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఘనంగా నియోజకవర్గ ఇన్‌చార్జి యడం బాలాజీ పుట్టిన రోజు
- 49 మంది రక్తదానం, సేవా కార్యక్రమాలు



బాలాజీ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

పర్చూరు (చినగంజాం)/చీరాల: రక్తదానం ప్రాణదానంతో సమానం అని వక్తలు పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ యడం బాలాజీ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం చీరాలలోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలాజీ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. యడం చిన రోశయ్య ట్రస్ట్ ,ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో చీరాల ఏరియా వైద్యశాల వైద్యులు డాక్టర్ రాజా సిల్వన్ నేతృత్వంలో ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 49 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ అభిమానులు, ఔత్సాహికులు రక్తదానం చేశారు. రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ పండ్లు అందజేసి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీదీపక్, పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, గుర్రం అనిల్, గ్రంధి కిరణ్, బాపట్ల పార్లమెంట్ జిల్లా కార్యదర్శి తమ్మారెడ్డి, మాజీ జిల్లా కమిటీ సభ్యులు మువ్వల రాంబాబు, కొరబండి సురేష్, నక్కా పోలిరెడ్డి, స్వామి, సిబ్బంది గుంటి సురేష్, సాయి, ఇందేటి జితేంద్ర, ముసలా రెడ్డి, కర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. బాలాజీ పుట్టినరోజు సందర్భంగా చినగంజాంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం హేమంత్ కుమార్ రెడ్డి, కుక్కల నాగమల్లేశ్వరరెడ్డి, రమేష్ రెడ్డి, మార్పు ఎలీషా, షాకీర్, ఇసూబ్, సుభాని ఖాన్, సాయి, ఎద్దు మాల్యాద్రి, ఉప్పుగుండూరు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



చందలూరు గ్రామస్తుల సమస్య తెలుసుకుంటున్న ఆర్‌డీఓ

జే.పంగులూరు: రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా చూడాలని పంగులూరు తహసీల్దార్‌కు ఆర్‌డీఓ సూర్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని పంగులూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సమస్యల పరిష్కార సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆర్‌డీఓ చందలూరు గ్రామంలోని కొందరు మా గ్రామంలో గ్రామ కంఠం కింద 737 సర్వే నంబర్ 28.62 ఎకరాలలో గ్రామస్తులు ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా గ్రామంలో స్థలాలను రిజిస్ట్రేషన్ నిలిపివేశారని తెలిపారు. అప్పటి నుంచి గ్రామస్తులు ఏదో సర్వే నంబర్ పెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని ఆర్‌డీఓకి తెలిపారు. గ్రామంలో ఉన్న 28.62 ఎకరాలలో 17 సెంట్లు ఎండోమెంట్ కింద ఉందని అది, గ్రామ కంఠానికి సంబంధించిన స్థలం ఒకే సర్వే నంబర్ ఉండటం వలన రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలుపడటం లేదటం లేదని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి దేవదాయ భూమి 17 సెంట్లు సబ్ డివిజన్ చేసి, మిగిలిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా రిజిస్ట్రార్‌కు తెలియజేస్తామని తెలిపారు. అదే విధంగా తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో 60 ఎకరాలను 57 మంది రైతులు ఎప్పటి నుంచో సాగు చేస్తున్నారని, కాని వారికి ఆ పొలానికి సంబంధించిన పట్టా ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు పోయి 57 మంది రైతులకు పట్టాలు వచ్చే విధంగా చూస్తామని తెలిపారు. తద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయన్నారు.

108 వాహనంలో బిడ్డ ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన మహిళ

చినగంజాం: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో ప్రసవం అయిన ఘటన మంగళవారం చిన గంజాం మండల పరిధిలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం పంచాయతీ కోడూరి వారిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతోంది. మంగళవారం సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆమెను వాహనంలో ఎక్కించుకొని ఆసుపత్రికి బయలుదేరారు. పెదగంజాం, చినగంజాం గ్రామాల మధ్య ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ నాగలక్ష్మి మహిళకు వాహనంలోనే చికిత్సను అందించి డెలివరీ చేసింది. ప్రసవం తరువాత తల్లీ బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉండటంతో బంధువులు ఆనందం వ్యక్తం చేశారు. ఈఎంటీ, పైలట్ భాగ్యారావును బంధువులతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

చెకుముకి పరీక్ష విద్యార్థులకు ఉపయోగం



కొరిశపాడులో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం



అద్దంకిలో ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

అద్దంకి/మేదరమెట్ల: జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి పరీక్షలతో విద్యార్థుల్లో విజ్ఞానం కలుగుతుందని హెచ్‌ఎం సీహెచ్ గురవయ్య అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. 13 పాఠశాలలకు సంబంధించి టీముకు ముగ్గురు వంతున 16 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ టెస్ట్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్ అద్దంకి, తిమ్మాయపాలెం హై స్కూల్, శంఖవరప్పాడు హైస్కూల్ టీమ్‌లు అర్హత సాధించి జిల్లాస్థాయికి అర్హత సాధించాయని చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, జనరల్ సెక్రెటరీ బీ చంద్రశేఖర్, శ్రీనివాసరావు మొదలగువారు పాల్గొన్నారు.

– చెకుముకి టాలెంట్ పోటీలు కొరిశపాడు మండలం మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాధాస్ గీతం హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ స్థానాల్లో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చినగంజాం: కడవకుదురు జెడ్పీహెచ్ఎస్‌లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు, చినగంజాం మండల జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ ఎస్ నరసింహారావు, సైన్సు ఉపాధ్యాయులు సమక్షంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించి మండల స్థాయి పరీక్ష నిర్వహించారు. కడవకుదురు, సత్యం హైస్కూల్ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఇంకొల్లు చెకుముకి పోటీలు నిర్వహించినట్లు మండల జేవీవీ కన్వీనర్ యూ చెంచయ్య తెలిపారు. పోటీలలో పావులూరు జెడ్పీహెచ్ఎస్, గంగవరం ఎస్‌వీకే హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్ల చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ శ్రీనివాసరావు, యం సత్యనారాయణ,టీ ఆదినారాయణ, సీహెచ్ హనుమంతరావు, వీ విజయలక్ష్మి, కేజేఆర్ కుమారి పాల్గొన్నారు.



చినగంజాంలో టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

గాంధీజీ జీవితం అందరికీ ఆదర్శం



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొడవలివారిపాలెం (కారంచేడు): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం పాఠశాల అవరణలో గాంధీజీ జయంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం గాంధీజీ నేర్పించిన స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): చిన్నారుల కోసం పర్చూరు రోటరీ క్లబ్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం స్థానిక క్లబ్ భవన్‌లో రక్తదానం చేసేందుకు 50 మంది ముందుకు వచ్చినట్లు ఆయన వివరించారు. మంగళవారం తోకల నాగయ్య, సుబ్బాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం మనవడు కొమ్మాలపాటి మనోజ్ కుమార్, లక్ష్మీ సుమ దంపతుల ఆర్థిక సహాయంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రక్తదానం చేసిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రొటేరియన్ రాయల శ్రీనివాసరావు, ముఖ్య అతిథి తేళ్ల రమేష్ చంద్ర, తలసేమియా యూనిట్ ఇన్‌చార్జ్ శివాజీ, రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పీ సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాల్వ సత్యనారాయణ, పాబోలు వెంకన్న, కొల్లా సుబ్బారావు, ఆకుల వెంకటేశ్వరరావు, భవనం రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది ఆందోళన



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని అందిస్తున్న సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు

చీరాల: ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించకుండా ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించడాన్ని నిరసిస్తూ చీరాలలో ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్లు మంగళవారం వైన్‌షాపులను మూసివేశారు. అనంతరం రేపల్లెలోని మద్యం డిపోవద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. తమను షాపుల్లో నియమించేటప్పుడు అర్థాంతరంగా తొలగిస్తామని చెప్పలేదని, తమకు చెప్పకుండానే విధుల్లోని తీసుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు షాపులుగా చేయడం వలన తమను తొలగిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇలా జరిగితే దీనినే నమ్ముకున్న తమ కుటుంబాలు రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా నిబద్ధతతో పని చేశామని అకారణంగా తమను విధుల్లోని తొలగించి ప్రైవేటు మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడం వలన తాము ఉపాధి లేక పూట గడవని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు.

మద్యం అమ్ముతున్న ముగ్గురి అరెస్టు

ఇంకొల్లు (చినగంజాం): అక్రమ మద్యం అమ్మకం సాగిస్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈఘటన ఇంకొల్లు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇంకొల్లు గ్రామంలోని కొణికి రోడ్డులోని లారీ యూనియన్ ఆఫీసు వద్ద ముగ్గురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 49 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మద్యం షాపులో పనిచేసే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ జీ సురేష్ మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్మేవారిపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

విధుల్లో చేరిన అధికారులు

చీరాల టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర ప్రాంతాల నుంచి చీరాలకు కేటాయించిన అధికారులు మంగళవారం విధుల్లో చేరారు. చీరాల ఎంపీడీఓగా పనిచేస్తున్న కె.నేతాజీ కారంచేడు ఎంపీడీవోగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో గుంటూరు జిల్లా అచ్చంపేట ఎంపీడీవోగా పనిచేస్తున్న పి.శివసుబ్రమణ్యం చీరాలకు కేటాయించగా బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ ఏవోగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావును ఒంగోలు జెడ్పీకి వెళ్లగా చీరాలకు ఏవోగా శర్మ ఒంగోలు జెడ్పీ నుంచి వచ్చి విధుల్లో చేరారు. అలానే పర్చూరు ఈవోఆర్డీగా పని చేస్తూ చీరాల ఈవోఆర్డీగా ఏ.రామకృష్ణను బదిలీ చేయగా ఇక్కడ పని చేస్తున్న డి. ఆనంద్ సత్యపాల్ పర్చూరుకు బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్‌గా కారంచేడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న వై. డానియేల్ ప్రసాద్ చీరాలకు రాగా ఇక్కడ పనిచేస్తున్న కె. విమల ఒంగోలు జెడ్పీ కార్యాలయానికి వెళ్లారు. అయితే ఉద్యోగుల బదిలీలు, బాధ్యతల స్వీకరణ మాత్రం టీడీపీ నాయకులు చెప్పిన వారికే పోస్టింగులు ఇచ్చారు. బదిలీపై చీరాలకు వచ్చి విధుల్లో చేరిన అధికారులు, సిబ్బంది మాత్రం గతంలో తాము పనిచేసిన స్థానాల్లో నుంచి రిలీవ్ కాకుండానే ఇక్కడ విధుల్లో చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సంక్షిప్తంగా

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

చీరాల రూరల్: జిల్లాస్థాయిలో అండర్-19 విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం సి. కిషోర్ కైవసం చేసుకోగా జావెలిన్ త్రోలో కె. జీవరత్నం ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో జీవకుమార్ సాధించాడు. షాట్‌పుట్ విభాగంలో జె. ప్రథమ స్థానంలో పి. కిషోర్, ద్వితియ స్థానంలో జె. దయాసాగర్ కైవసం చేసుకున్నాడు. కబడ్డీకి కట్ట వెంకట సాయి, అర్జిల్లి రాజులు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ విభాగంలో విలియం టిండెల్, కె. నిఖిల్ రాయ్, జి. సుమంత్, దేవరాజ్‌లు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, కళాశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు అందజేత

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థినులకు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి నూతన వస్త్రాలను అందించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థినులకు ట్రస్టు ఆధ్వర్యంలో రూ.6500 విలువ గల నూతన వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత, లైబ్రేరియన్ ఎన్.విజయసారథి, మధుసూదనరావు, తిలక్, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మార్టూరు: ఖరీఫ్ సీజన్లో పంటల నమోదుకు గడువు మంగళవారంతో ముగిసిందని.. పంటల నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం పైరులో వచ్చే చీడపీడల నివారణ గురించి వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి బీ హనుమంత నాయక్ ఉద్యాన వన శాఖ తరఫున రైతులకు రాయితీపై పంపిణీ చేయనున్న యంత్ర పరికరాల గురించి వివరించారు. కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మత్తు పదార్థాలతో జీవితం నాశనం

చీరాల: ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత ఎక్కువగా బానిసలు అవుతున్నారని, ఈ వయస్సులో బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై, సిబ్బంది ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులకు బహుమతులు



చల్లా గాయత్రి



జి వెంకటపావనిసాయి

జే.పంగులూరు: జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పంగులూరు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు గెలుపొంది బహుమతులు సాధించారు. 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అనే అంశంపై మంగళవారం బాపట్ల డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో డీఎస్ఓ సమక్షంలో జరిగిన పోటీలో మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని చల్లా గాయత్రి, డిబేట్ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి రూ. 5 వేలు నగదు గెలుచుకుంది. బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి వెంకట పావని సాయి ఎస్ఏ రైటింగ్ పోటీలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ. 3 వేలు నగదు గెలచుకున్నారు. వీరు ఈ నెల 11వ తేదిన అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు తీసుకొనున్నట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన ఇద్దరు విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.